క్లుప్తంగా

న్యాయవాదులకు స్టైఫండ్ పునరుద్ధరించాలి


వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఖమ్మంలీగల్: ఐదేళ్లలోపు అనుభవం ఉన్న బీసీ యువ న్యాయవాదులకు స్టైఫండ్‌ను పునరుద్ధరించాలని ఫెడరేషన్ ఆఫ్ లీగల్ ప్రొఫెషనల్స్ అధ్యక్షుడు, అడ్వకేట్ తాళ్లూరి దిలీప్ ఆధ్వర్యంలో జిల్లా బీసీ అభివృద్ధి శాఖ సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. మూడేళ్లుగా స్టైఫండ్ ప్రక్రియకు సంబంధించిన ఎలాంటి నోటిఫికేషన్ విడుదల చేయకపోవడంతో న్యాయవాదులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకుని తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

బాధ్యతలు స్వీకరించిన ఏపీఎం వెంకటరామారావు



కామేపల్లి: కామేపల్లి ఏపీఎంగా మాదాసు వెంకటరామారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘం మహిళలకు సేవలు అందించడంతో పాటు సంఘాల బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

గంజాయితో పట్టుబడిన యువకుడు

రఘునాథపాలెం: మండలంలోని జింకల తండా క్రాస్ వద్ద గంజాయి సేవిస్తున్న ఇద్దరు యువకులను రఘునాథపాలెం పోలీసులు శుక్రవారం గుర్తించారు. ఖమ్మం రోటరీనగర్‌కు చెందిన హేమంత్, ఆయన మిత్రుడు భాస్కర్ కలిసి 70 గ్రాముల గంజాయి తీసుకెళ్లి సేవిస్తుండగా శుక్రవారం సీఐ ఉస్మాన్ షరీఫ్ ఆధ్వర్యాన చేపట్టిన తనిఖీల్లో బయటపడింది. అయితే, హేమంత్ పట్టుబడగా భాస్కర్ పారిపోయాడని సీఐ తెలిపారు.

మాజీ ఎంపీ పరామర్శ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం కార్పొరేషన్ బీఆర్ఎస్ మున్సిపల్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ షేక్ మక్బూల్ తల్లి ఇటీవల మృతి చెందగా ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు వారి కుటుంబీకులను శుక్రవారం పరామర్శించారు. ముస్తఫానగర్‌లోని వారి నివాసానికి వెళ్లిన ఆయన కుటుంబీకులతో మాట్లాడారు. అనంతరం టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా ఉపాధ్యక్షులు వనం వెంకటేశ్వర్లు తల్లి లక్ష్మమ్మ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను సైతం మాజీ ఎంపీ పరామర్శించారు. కేఎంసీ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కర్నాటి కృష్ణ, నాయకులు ఇలియాజ్, సలీం, శేషు, కరీముల్లా, జమల్, లాలా, జబ్బర్, రియాకత్ అలీ, ఇస్మాయిల్, నెమలి కిషోర్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలుతో తీవ్ర నష్టం

ఖమ్మం మామిళ్లగూడెం: ఎస్సీ వర్గీకరణ అమలుతో మాల జాతి విద్యార్థి యువకులకు అడ్మిషన్లు, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో తీవ్ర నష్టం జరుగుతుందని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జేఏసీ ఖమ్మం జిల్లా కన్వీనర్ గుంతెటి వీరభద్రం అన్నారు. సమితి ఆధ్వర్యంలో శుక్రవారం సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునఃపరిశీలించాలని కోరుతూ కలెక్టరేట్‌లో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ శ్రీనివాసరావుకు వినతి అందజేశారు. జిల్లా అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, రవి, జాకోబ్, భాస్కర్, నరసింహారావు, దయానంద్, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, చిరంజీవి, సుధాకర్, రామారావు, మల్లయ్య, కనకరాజు, వేణు ఉన్నారు.

రేపు ఉద్యోగుల మహా సమ్మేళనం

ఖమ్మంరూరల్: ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో రేపు(ఆదివారం) నాయుడుపేట సర్కిల్‌లోని ఫంక్షన్‌హాల్‌లో తలపెట్టిన మహాసమ్మేళనాన్ని జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం ఉపాధ్యాయులు, సంఘం బాధ్యులు బైక్ ర్యాలీ నిర్వహించారు. సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయ్, పెరుమళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఈ సమ్మేళనం రాజకీయాలకతీతంగా, కేవలం మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాయకులు వెంకటేశ్వర్లు, ఎర్రమళ్ల శ్రీనివాసరావు, వీరన్న, నాగమణి, మల్లయ్య, కిషన్‌నాయక్, దేవయ్య ఉన్నారు.

శిథిలావస్థలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపుడిలో ఏడేళ్లుగా శిథిలావస్థలో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం, సీపీఐ, డీవైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు చిమ్మపూడిలో నిర్మించిన 55 డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద ధర్నా నిర్వహించి తహసీల్దార్ ఎస్.శ్వేతకు వినతిపత్రం అందజేశారు. నవీన్‌రెడ్డి, మల్లేష్, రమేష్, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, వెంకటరెడ్డి, కృష్ణారెడ్డి, సత్యనారాయణ, జైపాల్, పెద్దారెడ్డి, రాముడు, విష్ణుమూర్తి, లక్ష్మీనారాయణ ఉన్నారు.

అడ్డగోలుగా కట్టేస్తున్నారు..!

అనుమతి లేకుండానే భవన నిర్మాణాలు
- ఏదులాపురం మున్సిపల్ పరిధిలో ఎవరికి వారే...
- అయినా పట్టించుకోని మున్సిపల్ అధికారులు


మున్సిపాలిటీ పరిధిలో నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనం

ఖమ్మంరూరల్: అసలే కొత్త మున్సిపాలిటీ.. నిబంధనలు ఎలా ఉంటాయో ఏమో.. అనుమతులు తర్వాత ముందైతే ఇల్లు కట్టుకుందాం.. అదీ కూడా మూడు, నాలుగు అంతస్తులు కడదాం.. అధికారులెవరైనా వస్తే రాజకీయ పలుకుబడితోనే, ఇంకా వేరే రకంగానో నాయానో, భయానో తమ దారికి తెచ్చుకుని పని కానిచ్చేద్దాం అన్న రీతిలో ఏదుపులారం మున్సిపల్ పరిధిలో అనుమతులు లేకుండా భవన నిర్మాణాలు జరుగుతున్నాయి. అయినా అటువైపు అధికారులెవరూ కన్నెత్తి కూడా చూడకపోవడంలో ఉన్న ఆంతర్యం ఏమిటో ఎవరికీ అంతుబట్టడం లేదు. ఇక కొందరైతే తాము పంచాయతీగా ఉన్నప్పుడే అనుమతులు తీసుకున్నామని చెబుతూ నిర్మాణాలు కానిచ్చేస్తున్నారు.

అనుమతుల గడువు ముగిసినా..

గతంలో పంచాయతీలుగా ఉన్న సమయంలో నిర్మాణాలకు అనుమతులు తీసుకున్న కొందరు అవి ఏనాడో ముగిసిపోయినా అదే అనుమతులతో నిర్మాణాలు చేపట్టడం గమనార్హం. అసలు నిబంధనల ప్రకారం పంచాయతీగా ఉన్నప్పుడు తీసుకున్న అనుమతులు ఇప్పుడు మున్సిపాలిటీ ఏర్పడిన తర్వాత చెల్లుబాటు కావని మున్సిపల్ అధికారులే చెబుతున్నారు. మరి అలాంటప్పుడు పంచాయతీల్లో తీసుకున్న అనుమతులు ఇప్పుడెలా చెల్లుబాటు అవుతాయనే ప్రశ్నకు సమాధానం లేదు. ఎవరైనా నిబంధనలను ఉల్లంఘించి నిర్మాణాలను కూల్చేస్తాం అనడమే తప్ప ఆచరణలో ఏదీ ఉండదనేది యదార్థం

రూ.లక్షల్లో ఆదాయానికి గండి..

ఇలా అడ్డగోలు నిర్మాణాలతో మున్సిపాలిటీకి రూ.లక్షల్లో చలాన్ రూపంలో రావాల్సిన ఆదాయానికి గండి పడుతోంది. అసలే నిధుల లేమితో ఏపని సరిగా చేయలేక సతమతమవుతున్న అధికారులకు ఇలా చలాన్ రూపంలో వచ్చే ఆదాయాన్ని కూడా సమకూర్చుకోలేక పోతున్నారనే విమర్శలున్నాయి.

నిబంధనలు ఇవీ..

నిబంధనల ప్రకారం ఏదైనా భవన నిర్మాణం చేయాలంటే టౌన్ ప్లానింగ్ అధికారి క్షేత్రస్థాయిలో పర్యటించి సర్టిఫై చేయాల్సి ఉంటుంది. అదేవిధంగా సదరు భవన నిర్మాణ వ్యక్తి ఎన్ని అంతస్తులు నిర్మిస్తున్నారో అధికారికి దరఖాస్తు చేసుకోవాలి. అనంతరం మున్సిపల్ నిబంధనల మేరకు అధికారులు నిర్మాణాలకు అనుమతులు ఇస్తారు. కానీ ఇవేవీ లేకుండానే మున్సిపాలిటీలోని వెంకటగిరి, రెడ్డిపల్లి, పెద తండా, వరంగల్‌క్రాస్‌రోడ్ ఏరియాల్లో యథేచ్ఛగా నిర్మాణాలు జరుగుతున్నాయి. తమ ఇష్టానుసారం 500, 800, 900 గజాల్లో కూడా భవన నిర్మాణాలు చేపడుతున్నారంటే భవన నిర్మాణాల్లో నిబంధనలు ఏమేరకు ఉల్లంఘనకు గురవుతున్నాయో ఇట్టే తెలిసిపోతోంది.

అనుమతి లేకపోతే కఠిన చర్యలు

నిబంధనలను కాదని ఇళ్లు, బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడితే మున్సిపల్ ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. ఎవరైనా ముందస్తు అనుమతి తీసుకోవాల్సిందే. పంచాయతీగా ఉన్నప్పుడు తీసుకున్న అనుమతి గడువు తీరితే చెల్లుబాటు కాదు. ఎప్పటికప్పుడు మా ఉద్యోగులతో తనిఖీ చేయిస్తూనే ఉన్నాం.

– అళ్ల శ్రీనివాసరెడ్డి, కమిషనర్

సాగులో సాంకేతికతతో మేలు..


రఘునాథపాలెం: అవగాహన కల్పిస్తున్న ఏడీఏ


కూసుమంచి: క్షేత్ర ప్రదర్శనలో ఏఓ, రైతులు

రఘునాథపాలెం: నానోఎరువును వినియోగించడంతో రైతులకు పంటలపై పెట్టుబడి తగ్గడంతోపాటు, దిగుబడులు పెరిగి రెండు రకాల లాభం జరుగుతుందని ఖమ్మం ఏడీఏ కొంగర వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండలంలోని చింతగుర్తి, చెరువుకొమ్ముతండా, చిమ్మపుడి గ్రామాల్లో నానో డీఏపీ, యూరియా వాడకంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఓ కర్నాటి ఉమామహేశ్వరరెడ్డి, ఏఈఓలు శిరిణ్మయి, వేదవ్యాస్, ప్రతిభ, వేదిత, రైతులు, పాల్గొన్నారు.

కూసుమంచి: నానోయూరియా వినియోగంపై శుక్రవారం మండలంలోని గట్టుసింగారం గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. ఏఓ వాణి, ఏఈఓ వంశీ, పలువురు రైతులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు, రేషన్‌కార్డులు


పట్టాలు పంపిణీ చేస్తున్న మేయర్ నీరజ

ఖమ్మంమయూరిసెంటర్: అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. శుక్రవారం నగరంలోని పలు డివిజన్లలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు, రేషన్‌కార్డులు, సీఎంఆర్ఎఫ్ చెక్కులను వారి ఇళ్లకు వెళ్లి మేయర్ పంపిణీ చేశారు. డిప్యూటీ మేయర్ ఫాతిమ జోహర, త్రీటౌన్ ఏరియా కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ యర్రం బాలగంగాధర్ తిలక్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు డి.శంకర్‌నాయక్, ఓబీసీ సెల్ అధ్యక్షుడు బాణాల లక్ష్మణ్, ఏఎంసీ డైరెక్టర్ బి.సత్యనారాయణ, నాయకులు కన్నం ప్రసన్న కృష్ణ, ధనాల వెంకటరమణ, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

ఖమ్మంరూరల్: మండలంలోని గొల్లగూడెం 19 వార్డుకు చెందిన పలువురు నాయకులు మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బి.హరినాథ్‌బాబు, అశోక్, శ్రీను, సారిక, టి.గణేష్, పి.సత్యనారాయణ, చీర్ల నాగరాజు, ఏనుగు చెమ్మారెడ్డి, గంగుల గోపి, తదితరులు ఉన్నారు.

లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంరూరల్: మండలంలోని కోదాడక్రాస్‌రోడ్డులోని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో స్టాటిస్టిక్స్ బోధనకు పార్ట్‌టైం ప్రాతిపదికన లెక్చరర్‌గా పని చేయుటకు ఆసక్తి గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. ఎం. సునీత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీలో 55 శాతం మార్కులు పొంది ఉండి, పీహెచ్‌డీ, నెట్, సెట్ ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని, ఈనెల4 లోపు విద్యార్హత సర్టిఫికెట్‌లతో ప్రిన్సిపాల్ కార్యాలయంలో అందించాలని తెలిపారు.

ధర్నాను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న నాయకులు

తిరుమలాయపాలెం: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి మూడు దశల పోరాట కార్యక్రమంలో భాగంగా రెండో దశలో జిల్లా కేంద్రంలో ఈనెల 5న నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం తిరుమలాయపాలెం ఉన్నత పాఠశాలలో జరిగిన ఉపాధ్యాయుల శిక్షణ కేంద్రంలో వారు మాట్లాడుతూ.. మూడో దశలో 23న హైదరాబాద్‌లో ధర్నా తలపెట్టనున్నామన్నారు. నాయకులు ఏవీ. నాగేశ్వరరావు, కేష్యా, వెంకట్రాములు, వెంకటేశ్వరరావు, నవీన్, ధనమూర్తి, రవికిషోర్, సత్తార్, సత్యనారాయణ రెడ్డి, బాలచందర్, ప్రసాద్, విజయలక్ష్మి, రవీంద్ర, కృష్ణకళ, శోభన ఉన్నారు.

రేపు కవి సమ్మేళనం

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు ఆంధ్ర సారస్వత పరిషత్ వికాస వేదిక సాహిత్య సంస్థ, వికాస వేదిక సాహిత్య సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు లెనిన్ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 3, 4, 5 తేదీల్లో నిర్వహించనున్న ప్రపంచ తెలుగు మహాసభలకు సన్నాహక కార్యక్రమంలో సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

చెరువుమాదారం నుంచి నీటి విడుదల


నీటి విడుదల అనంతరం పూజలు చేస్తున్న చైర్మన్, రైతులు

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాదారం ఎత్తిపోతల పథకం నుంచి సాగు అవసరాలకు శనివారం నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎత్తిపోతుల పథకం చైర్మన్ యలగాల భూషయ్య మాట్లాడుతూ ఆయకట్టు కింద ప్రతీ ఎకరాకు నీరు అందించేలా కృషి చేస్తున్నామని తెలిపారు. వివిధ గ్రామాల్లో 4,800 ఎకరాల ఆయకట్టు ఉండగా, మూడు పంపుల ద్వారా నీరు విడుదల చేశామని, మిగిలిన రెండు పంపుల మరమ్మతు పూర్తయ్యాక వాటి ద్వారా కూడా విడుదల చేస్తామని చెప్పారు. మాజీ సర్పంచ్ యలగాల పద్మ, రైతులు తీగకొండలు, నాగరాజు, రాఘవయ్య ఉన్నారు.

విదార్థులకు అవగాహన

రఘునాథపాలెం: మండలంలోని మంచుకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రవిప్రసాద్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులకు చిన్ననాటి నుంచే ఆర్థిక వ్యవహారాలపై అవగాహన ఉండాలన్నారు. ఇండియన్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, కృష్ణవేణి, హెచ్ఎం రావెళ్ల కరుణకుమారి, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, భానుమతి, సుజాత, రామారావు పాల్గొన్నారు.


పనులు పూర్తి చేయాలి


ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని ప్రధానమైన వైరా రోడ్ జిల్లా కోర్టు ఎదుట నత్తనడకన సాగుతున్న ప్రధాన డ్రెయినేజీ పనులు వెంటనే పూర్తి చేయాలని, కొద్దిరోజులుగా ఈ ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతున్నాయని సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం పార్టీ ఖానాపూరం హవేలీ కమిటీ ఆధ్వర్యంలో స్టేడియం, కోర్టు ఎదుట సాగుతున్న డ్రైనేజీ పనులను పార్టీ బృందంతో కలిసి పరిశీలించింది. పార్టీ మండల కార్యదర్శి దొంగల తిరుపతిరావు, పోతురాజు వెంకట్, అమరావతి, శ్రీను వాసురావు, అంజయ్య ఉన్నారు.

చేయూత అందించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: పేద విద్యార్థులకు చేయూత అందించాలని సత్తుపల్లికి చెందిన సుధా హెర్బల్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ డాక్టర్ కొనకళ్ల సుధారాణి అన్నారు. ఈ మేరకు కత్తుల వీరమ్మ మెమోరియల్ ఎయిడెడ్ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం బూట్లు పంపిణీ చేశారు. అనంతరం పాఠశాలలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం అలివేలు, ఉపాధ్యాయురాలు నాగమణి ఉన్నారు.

సామూహిక వరలక్ష్మీ వ్రతం


ఖమ్మంఅర్బన్: వ్రత పూజలు చేస్తున్న మహిళలు


ఖమ్మంగాంధీచౌక్: ప్రత్యేక అలంకరణలో ధనలక్ష్మీ అమ్మవారు

ఖమ్మంఅర్బన్: శ్రావణ శుక్రవారం సందర్భంగా నగరం మధురానగర్ సాయిబాబా మందిరంలో భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మి వ్రతం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భువనేశ్వరి అమ్మవారికి 108 కేజీల కుంకుమతో విశిష్ట కుంకుమార్చన, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, దేవాలయ బాధ్యులు వల్లభనేని శ్రీనివాసరావు, కార్పొరేటర్ వలరాజు, రామారావు తదితరులు ఉన్నారు.

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని శ్రీ గుంటుమల్లేశ్వర స్వామి ఆలయంలో భక్తులు గోపూజలు చేశారు. అనంతరం భ్రమరాంబ అమ్మవారికి అభిషేకాలు చేసి అలంకరణలు చేసి పూజలు చేశారు. సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి చుండూరు రామకోటేశ్వరరావు పర్యవేక్షణలో అర్చకులు దాములూరి వీరభద్రరావు, దాములూరి కృష్ణశర్మలు కార్యక్రమలను నిర్వహించారు. నగరంలోని ఇల్లెందు క్రాస్ రోడ్డులో ఉన్న శ్రీ పవన సుత శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవస్థానంలో ఉన్న ధనలక్ష్మీ అమ్మవారికి అర్చకులు అనంత పద్మనాభాచార్యులు పూజలు చేశారు.

ప్రతీ ఇంటి చుట్టూ శుభ్రత అవసరం

- చెత్త పేరుకుపోతే జరిమానా
- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి


ఫ్రైడే డ్రైడే పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్, డీఎంహెచ్‌వో కళావతిబాయి

ఖమ్మంఅర్బన్: సీజనల్ వ్యాధుల వ్యాప్తిని నివారించాలంటే ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. నగరంలోని మూడో డివిజన్ బల్లేపల్లి రెయిన్‌బో నగర్‌లో శుక్రవారం నిర్వహించిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో మున్సిపల్, వైద్యశాఖ అధికారులతో కలసి కాలనీలో ఇంటింటి చెత్త, కాల్వల పరిశుభ్రత, నీటి నిల్వల పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డెంగీ లాంటి వ్యాధులు నిల్వ నీటితో వ్యాప్తి చెందుతున్నాయని, వాటిని నివారించేందుకు ప్రతిఒక్కరూ ముందు జాగ్రత్తలు పాటించాలన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు, డివిజన్ పరిధిలో ఉన్న మురుగు కాలువలు, డ్రెయినేజీలకు మందులు చల్లే ప్రక్రియ చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి శానిటేషన్ పనులను వేగవంతం చేయాలని, అవసరమైన చోట ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఖాళీగా ఉన్న ప్రైవేట్ ప్లాట్ల యజమానులు తక్షణమే చెత్తను తొలగించకపోతే జరిమానాలు విధించి, ఆ డబ్బుతో శుభ్రత పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి కళావతిబాయి, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ అనిల్ కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ బాబు, మంచుకొండ డాక్టర్ బాలకృష్ణ, మున్సిపల్, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రోప్‌వే నిర్వాసితులకు పట్టాలు

ఖమ్మంరాపర్తినగర్: ఖమ్మం ఖిల్లా ప్రాంతంలో పర్యాటక అభివృద్ధికి రోప్ వే నిర్మించనుండగా పలువురి భూములు సేకరించాల్సి వచ్చింది. ఈ మేరకు నిర్వాసితులకు బల్లెపల్లి వద్ద భూమి కేటాయించగా.. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శుక్రవారం తన కార్యాలయంలో పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖిల్లాకు రోప్ వే ఏర్పాటుతో పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, ఆర్డీఓ నర్సింహారావు, తహసీల్దార్ సైదులు పాల్గొన్నారు.

వార్డు ఆఫీసర్లకు అవార్డులు


మాట్లాడుతున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంమయూరిసెంటర్: క్షేత్రస్థాయిలో ఉత్తమ పనితీరు కనబరిచిన వార్డు ఆఫీసర్లకు బెస్ట్ వార్డ్ ఆఫీసర్ అవార్డు ఇవ్వడం జరుగుతుందని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య అన్నారు. ఈ మేరకు శుక్రవారం కేఎంసీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వార్డు ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేటాయించిన డివిజన్లలో వార్డు ఆఫీసర్లు పారిశుద్ధ్యంపై ఆకస్మిక తనిఖీలు చేయాలని, కార్మికుల హాజరు, జవాన్ల పనితీరును పరిశీలించాలన్నారు. ప్రతీ సోమవారం డివిజన్ కార్యాలయాల్లో ఉంటూ ప్రజల సమస్యలను తెలుసుకోవాలని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా అవసరమైన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, దోమల నివారణకు రసాయనాలను పిచికారీ చేయించాలన్నారు. ఈ సమావేశంలో ఏఎంసీ అనిల్‌కుమార్, ఉద్యాన అధికారిణి బెల్లం రాధిక తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి


రాస్తారోకో చేస్తున్న నాయకులు

ఖమ్మంరూరల్: మండలంలోని మద్దులపల్లిలో గల జేఎన్‌టీయూహెచ్ ఇంజనీరింగ్ కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈ.రామకృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రవీణ్, జార్జిరెడ్డి, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎం.సురేష్, కార్యదర్శి మస్తాన్ అన్నారు. ఈ మేరకు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఖమ్మం–సూర్యాపేట రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కళాశాలకు శాశ్వత భవనాలు, రెగ్యులర్ ఫ్యాకల్టీ, ల్యాబ్స్, లైబ్రరీ లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని అనుమతి లేకుండా రాస్తారోకో చేస్తున్నారంటూ సంఘాల నాయకులను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నాయకులు లక్ష్మణ్, రాము, జంపన్న, మనోజ్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లు, స్థలాలివ్వాలి

ఖమ్మంరూరల్: అర్హులైన పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని రైతుసంఘం నాయకులు వి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండలంలోని వరంగల్‌క్రాస్‌రోడ్డులో శుక్రవారం నిర్వహించిన సాయుధ పోరాట యోధుడు కృష్ణమూర్తి వర్ధంతి సభలో నివాళులర్పించారు. నాయకులు ఎస్.కృష్ణ, ఏ.ఉపేందర్, రామయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను మోసం చేస్తున్న ప్రభుత్వం

ఖమ్మంమయూరిసెంటర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఆటో డ్రైవర్లను మోసం చేస్తుందని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు అన్నారు. ప్రపంచ ఆటో కార్మికుల దినోత్సవం సందర్భంగా నగరంలోని పాత బస్టాండ్, రైతుబజార్ అడ్డా వద్ద ఆటో కార్మికులు శుక్రవారం కేక్ కట్ చేసి చేశారు. నాయకులు సత్తార్ మియా, నగర కమిటీ సభ్యులు వేణు సంగం, నాయకులు శ్రీనివాసరావు, రఘు, శంకర్, శివ, నరసింహారావు ఉన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ఆర్టీఐ కమిషనర్

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం త్రీటౌన్ గుట్టల బజార్‌లోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయాన్ని ఆర్టీఐ కమిషనర్ పీ.వీ.శ్రీనివాస్ – సృజన దంపతులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేయగా ఆలయ చైర్మన్ మేళ్లచెరువు వెంకటేశ్వరరావు, కమిటీ ప్రతినిధి దేవత రాజారావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి వితరణ

ఖమ్మంరూరల్: మండలంలోని ఎం.వెంకటాయపాలెం ఉన్నత పాఠశాలలో పనిచేసి ఈ నెల31న పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయురాలు జి.విజయలక్ష్మి పదవీ విరమణ సందర్భంగా రూ.50 వేల పాఠశాల అభివృద్ధికి శుక్రవారం వితరణ చేశారు. ఈ మేరకు విజయలక్ష్మిని పలువురు అభినందించారు.

దాడులకు నిరసనగా ర్యాలీ


నిరసన తెలుపుతున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: గాజాపై జరుగుతున్న ఇజ్రాయిల్ దాడులు వెంటనే ఆపాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, ఇన్సాఫ్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మహమ్మద్ సలాం డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం దాడులకు నిరసనగా నగరంలో ర్యాలీ నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు యానాల సాంబశివరెడ్డి, నాయకులు అవాజ్‌గౌస్, ఎస్‌కె.హుస్సేన్, ముబిన్, ఖలీల్, రసూల్ బాయ్, ఎస్‌కె.మీరా, హైమద్, రహిమాన్, ఎంఏ.అలీం, అబ్దుల్, ఇస్మాయిల్ భాయ్, ఆరిఫ్ అలీ ఉన్నారు.

టై, బెల్టులు పంపిణీ

కూసుమంచి: మండలంలోని లోక్యాతండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన వడిత్య శోభన్‌బాబు టై, బెల్టులు, గుర్తింపు కార్డులను అందించగా శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ రాయల వీరస్వామి, హెచ్‌ఎం శ్రీనివాసరావు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి చేయూత అందించాలన్నారు.

నేత్రపర్వంగా గిరి ప్రదక్షిణ


గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు


జ్యోతిని వెలిగిస్తున్న అర్చకులు

ఖమ్మంగాంధీచౌక్: భక్తజన సందోహం నడుమ ఖమ్మం నడిబొడ్డున ఉన్న స్తంభాద్రి గుట్ట చుట్టూ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి ఉత్సవ విగ్రహాల ఊరేగింపుతో నిర్వహించిన గిరి ప్రదక్షిణ కన్నుల పండువగా సాగింది. స్వామి వారి జన్మనక్షత్రం (స్వాతి నక్షత్రం) సందర్భంగా లోక కల్యాణార్థం ప్రతీ నెల నిర్వహించే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాయంత్రం గిరి ప్రదక్షిణ కార్యక్రమం నిర్వహించారు. పండితుల మంత్రోచ్చరణల నడుమ మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, కోలాటాల నడుమ స్వామి వారి ఉత్సవ విగ్రహాలను నగర పుర వీధుల్లో ఊరేగిస్తూ గిరి ప్రదక్షిణ చేశారు. అనంతరం గుట్టపై నక్షత్ర జ్యోతి (దివ్యజ్యోతి)ని పండితులు వెలిగించగా భక్తులు దర్శనం చేసుకున్నారు. ఈవో కొత్తూరు జగన్మోహన్ రావు, ఆలయ యంత్రాంగం, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.